క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుభద్ర

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 264 మంది హాజరుకావాల్సి ఉండగా, 147 మంది హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్, తహసీల్దార్ సుభద్ర పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షల చీఫ్‌సూపరింటెండెంట్‌గా బాలకేశవులు, డిపార్ట్‌మెంటల్ అధికారిగా యమునా లక్ష్మి వ్యవహరించారు.

దుత్తలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 472 మంది హాజరుకావాల్సి ఉండగా, 276 మంది హాజరయ్యారు. 196 మంది గైర్హాజరయ్యారు. దుత్తలూరు ఉన్నత పాఠశాలలో 208 మందికి గానూ 134 మంది, ఆదర్శ పాఠశాలలో 264 మందికి గానూ 142 మంది హాజరయ్యారు.

ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించం



అల్లూరు: ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. ఎస్సీ జాబితాలో ఇతర కులాల వారిని చేర్చడంపై అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. అనంతరం డీటీకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలో ఇతర కులాలకు చెందిన వారిని ఎస్సీ జాబితాలో చేర్చడం జరిగిందని తెలిపారు. దీనిపై గతంలో అధికారులకు వినతిపత్రం సైతం అందజేశామని చెప్పారు. వెంటనే ఇతర కులాల వారిని ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



కలిగిరి: కలిగిరి పంచాయతీ పరిధిలోని పాపనముసిలిపాళెంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి శనివారం బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన కలిగిరి యూత్ 11 జట్టుకు రూ. 15,116, రన్నర్‌గా నిలిచిన పాపనముసిలిపాళెం జట్టుకు రూ.7,116, తృతీయ స్థానంలో నిలిచిన కలిగిరి జట్టుకు రూ.5,116 నగదు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



ఎస్సీ కాలనీ సమీపంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పిచ్చి తీగలు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ స్తంభాలకు పిచ్చి తీగలు అల్లుకుపోయి విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నారు. పిచ్చితీగలు అల్లుకుపోవడంతో విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి మంటలు చెలరేగుతున్నాయి. ఈ కారణంగా గృహోపకరణాలు కాలిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి పిచ్చితీగలను తొలగించాలని వారు కోరుతున్నారు.



ఎస్టీ కాలనీలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పిచ్చితీగలు

ఉపాధి కూలీల చేతిలో బ్రహ్మాస్త్రం జన్‌వన్‌రేగా

- 2017లో అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్రం
- యాప్‌లో ఉపాధి కూలీల సమగ్ర వివరాలు
- స్మార్ట్‌ఫోన్ ఉంటే సులభంగా సేవలు
- అక్రమాలపైనా ఫిర్యాదు చేసే అవకాశం
- యాప్‌పై అవగాహన లేక నష్టపోతున్న కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సీతారామపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను పెంచి అక్రమాలకు తావివ్వకుండా కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేస్తోంది. పనుల మంజూరు, నిర్వహణ, వేతనాలకు సంబంధించి అనేక మార్పులను తీసుకొస్తోంది. కూలీల వేతనాలు దుర్వినియోగం కాకుండా నేరుగా బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఖాతాలను తెరిపించి జమ చేస్తోంది. అయితే వేతనజీవులు చాలా మంది తమ ఉపాధి బకాయిలు జమయ్యాయో..లేదో..ఒకవేళ జమైతే ఏ బ్యాంకులో పడ్డాయో తెలియక ఉపాధి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇలాంటి ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం జన్‌వన్‌రేగా యాప్‌ను 2017లో అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై సరైన అవగాహన కలిగి సద్వినియోగం చేసుకుంటే ఉపాధి కూలీల చేతిలో బ్రహ్మాస్త్రం అవుతుందని అధికారులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యాప్‌పై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించారు. అయినా కూలీలు సద్వినియోగం చేసుకోక నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించిన సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో జన్‌వన్‌రేగా యాప్‌తో ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్‌పెట్టేందుకు వీలవుతుందని నిపుణులు చెబుతున్నారు.

యాప్ వినియోగం ఇలా..

స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి జన్‌వన్‌రేగా అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తరువాత ఇన్‌స్టాల్ చేసుకుని అందులో ఉపాధి జాబ్ కార్డు సంఖ్య నమోదుచేసి క్లిక్ చేస్తే కూలీల వివరాలు వస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేయగానే పనిచేసిన రోజులు, వేతన బకాయిలు, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమయింది, తదితర వివరాలు స్పష్టంగా తెలుస్తాయి. వేతనం జమకాకపోతే ఎందుకు జమకాలేదో అనే అంశం కూడా తెలుసుకోవచ్చు. ఉపాధి పనుల సమాచారం కూడా అందులో ఉంటుంది.

అక్రమాలపైనా ఫిర్యాదులు చేయొచ్చు

జిల్లాలోని 37 మండలాలలో 2.78 లక్షల జాబ్ కార్డులు ఉండగా 4.38 లక్షల మంది కూలీలు ఉన్నారు. అందులో రోజూ సుమారు లక్ష మంది వరకు ఉపాధిహామీ పనులకు వెళుతుంటారు. ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలలో 63,650 జాబ్‌కార్డులుండగా 1,14,081 మంది కూలీలుగా నమోదై ఉన్నారు. వీరిలో ప్రతిరోజూ ఇరవై వేల మంది వరకు ఉపాధి పనులకు వెళుతుంటారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఇటీవల బోగస్ మస్తర్లు పుట్టుకురావడం, పనులకు వెళ్లకపోయినా హాజరైనట్లు రికార్డుల్లో నమోదుచేయడం వంటి ఘటనలు సామాజిక తనిఖీల్లో వెలుగు చూస్తున్నాయి. కూలీల సొమ్ము స్వాహాతో పాటు ఇతర అక్రమాలపై కూడా జన్‌వన్‌రేగా యాప్ ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది. క్షేత్రస్థాయిలో పని ప్రదేశాల్లో కూలీలతో కాకుండా యంత్రాలతో పనులు చేసినా, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినా, నిధులు దుర్వినియోగం చేసినా, బోగస్ మస్తర్లకు పాల్పడినా యాప్‌లో పిర్యాదు చేస్తే నేరుగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళుతుంది. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూరుస్తారు.

ఉదయగిరి నియోజకవర్గంలోని ఉపాధి కూలీల వివరాలు

మండలం	జాబ్‌కార్డుల సంఖ్య	కూలీల సంఖ్య
ఉదయగిరి	8,523	13,122
దుత్తలూరు	6,184	9,532
వరికుంటపాడు	7,405	12,122
వింజమూరు	8,432	12,787
కలిగిరి	10,143	16,241
కొండాపురం	9,319	15,489
జలదంకి	7,500	11,963
సీతారామపురం	6,144	10,225

యాప్‌పై అవగాహన కల్పిస్తాం



జన్‌వన్‌రేగా యాప్ వినియోగంపై కూలీలందరికీ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం. సెల్‌ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్, వినియోగం, తదితర అంశాలపై చైతన్యపరుస్తాం. కూలీలు కూడా ఈ యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. ఎంతో ఉపయోగపడే ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– గాయత్రిదేవి, ఉపాధి ఏపీడీ, ఉదయగిరి

కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత



కిశోరి వికాశంపై శిక్షణను ప్రారంభిస్తున్న సీడీపీఓ

చేజర్ల: కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యతని ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బందికి కిశోరి వికాసంపై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ జనాభాలో 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలు 20శాతం మంది ఉన్నారని తెలిపారు. కిశోర బాలికల్లో చైతన్యం నింపి విద్యావంతులుగా, ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడంతో పాటు భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కిశోరి వికాశం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అనంతరం బాల్యవివాహాల చట్టం, బాలికల అక్రమ రవాణా , సైబర్ నేరాలు, ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098,181,112 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలను చైతన్యపరిచి బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణాను కట్టడి చేయాలని కోరారు. ఎంపీడీఓ విజయలలిత, ఎంఈఓ మస్తానయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ, డీటీ మస్తానయ్య, ప్రశాంతి, రమాదేవి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరిన ఆర్‌ఎన్‌పీ స్టార్స్



సీతారామపురం : రంగనాయుడుపల్లెకు చెందిన ఆర్‌ఎన్‌పీ స్టార్స్ జట్టు క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకుంది. ఉదయగిరి మండలం వెంగళరావునగర్‌లో ముత్యాలపాటి ఖాదర్ సాహెబ్ జ్ఞాపకార్థంగా ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో ఉదయగిరి జూనియర్స్ జట్టుపై ఆర్‌ఎన్‌పీ స్టార్స్ జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో వెంగళరావునగర్ జట్టుతో తలపడనుంది.

కాకాణితో రామిరెడ్డి భేటీ



కాకాణితో చర్చిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శనివారం రాత్రి కలిశారు. కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ దాడులు, టీడీపీకి అనుకూలంగా ఉంటూ పోలీసులు ఏకపక్ష ధోరణిని అవలంబించడం, టీడీపీ పేరుతో కొన్ని మూకలు యథేచ్ఛగా దందాలు, దౌర్జన్యాలు చేస్తున్నప్పటికీ పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంపై సుదీర్ఘంగా చర్చించారు. వీటన్నింటిపై రానున్న రోజుల్లో న్యాయపరంగా పోరాటం చేసేందుకు చేపట్టాల్సిన పటిష్ట కార్యాచరణ ప్రణాళికలపై సమీక్షించారు. కాగా టీడీపీ దాడిలో గాయపడి కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఉదయం 10 గంటలకు పరామర్శించనున్నారు.

కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలి



వైద్యులకు సూచనలు చేస్తున్న ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

సంగం: ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ ఆదేశించారు. సంగం పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఫార్మసీ, ల్యాబ్, డెలివరీ రూములను పరిశీలించారు. మందుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. కుష్టు సర్వేపై వైద్యులకు సూచనలు అందచేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా పీహెచ్‌సీ ఆవరణలో స్వచ్ఛ భారత్ చేపట్టారు. ప్రతి నెలా 3వ శనివారం పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. వైద్యాధికారి అశోక్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీపీఎం సదస్సు

ఆత్మకూరురూరల్: సీపీఎం రాష్ట్ర మహాసభలు సందర్భంగా ఆత్మకూరులోని పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం సదస్సు నిర్వహిస్తున్నట్లు పట్టణ సీపీఎం కార్యదర్శి డేవిడ్‌రాజు శనివారం తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామ్‌భూపాల్ ముఖ్య అతిథిగా హాజరై పెట్టుబడి– ప్రజాస్వామ్యం అనే అంశంపై ప్రసంగిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



చేజర్ల: నాగులవెలటూరులో రక్తదాన శిబిరం

మర్రిపాడు/చేజర్ల/ఆత్మకూరురూరల్/అనుమసముద్రంపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆత్మకూరు సీఐ గంగాధర్ పేర్కొన్నారు. మర్రిపాడు మండలం తిక్కవరంలో మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సీఐ గంగాధర్, మెడికల్ ఆఫీసర్ గోపినాథ్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. అలాగే చేజర్ల మండలం నాగులవెలటూరులో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు మండలం దేపూరు, అనుమసముద్రంపేట బస్టాండ్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అల్లూరు/ఉదయగిరి/కొండాపురం/వరికుంటపాడు/సీతారామపురం: మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని అల్లూరు, ఉదయగిరి ప్రభుత్వాస్పత్రుల్లోని రోగులకు పండ్లు, రొట్టెలను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్, కొండాపురం మండలం సాయిపేట పంచాయతీ పరిధిలోని ఇస్కపాళెంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే సీతారామపురం, వరికుంటపాడులో ఎన్టీఆర్‌కు టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

పడకేసిన పారిశుధ్యం



మండల కేంద్రమైన చేజర్లలో పారిశుధ్యం పడకేసింది. వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. డ్రైనేజీలు పూడికతో నిండి మురుగు ముందుకు కదలక దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మండలాధికారులకు ఫిర్యాదు చేసినా పారిశుధ్యాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

- చేజర్ల

రేపట్నుంచి పశుఆరోగ్య శిబిరాలు

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లె, వరికుంటపాడు పశువైద్యశాలల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి మండల పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ శనివారం తెలిపారు. 20న తిమ్మారెడ్డిపల్లె, తోటలచెరువుపల్లె, 21 జీ కొండారెడ్డిపల్లె, గణేశ్వరపురం, 22 విరువూరు, తూర్పురొంపిదొడ్ల, 23 నార్త్ కొండాయపాళెం, వేంపాడు, 24న నార్త్‌కృష్ణంరాజుపల్లె, కాంచెరువు, 27న గొల్లపల్లె, టీ బోయమడుగుల, 28న పెద్దిరెడ్డిపల్లె, రామాపురం, 29 పామూరుపల్లె, వరికుంటపాడు, 30న ఇస్కపల్లి, 31న తూర్పుపాళెం, జడదేవి గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయని వివరించారు.

స్వచ్ఛఆంధ్ర సాధనకు సమష్టి కృషి



ఏఎస్‌పేటలో...



ఆత్మకూరు: చెత్తను తొలగిస్తున్న ఆర్డీఓ బీ పావని



అల్లూరులో..



ఉదయగిరిలో..



వరికుంటపాడులో..



సంగంలో..

- ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని

ఆత్మకూరు: స్వచ్ఛ ఆత్మకూరుతో పాటు స్వచ్ఛ ఆంధ్రను సాధించేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని అన్నారు. మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని టెంకాయతోపు, ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణాల్లో శనివారం నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికులు, మెప్మా, ఆర్డీఓ కార్యాలయాల సిబ్బందితో కలిసి చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. మెప్మా సిబ్బంది మాధవి, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి సెంటర్ వరకు ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛ దివస్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించి ప్రజలకు అవగాహన కల్పించారు.

జలదంకి: మండలంలోని చామదలలో పంచాయతీ కార్యదర్శి విజయమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. వీఆర్వో మణికంఠ, సర్పంచ్ సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొండాపురంలో..

కొండాపురం: ఎంపీడీఓ ఆదినారాయణ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ కే రవికుమార్, ఈఓపీఆర్డీ నారాయణ, ఏఓ శేష సాయి, సర్పంచ్ మాచర్ల పాల్గొన్నారు.

దుత్తలూరు: స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పిలుపునిచ్చారు. దుత్తలూరులో స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛదివస్‌పై శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, తదితరులు పాల్గొన్నారు. అలాగే దుత్తలూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పీ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు పరిసరాలను పరిశుభ్రం చేశారు.

సీతారామపురం : మండల కేంద్రమైన సీతారామపురంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా మలేరియా నియంత్రణ అధికారిణి హుస్సేనమ్మ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

సంగం: మండల కేంద్రమైన సంగంలో ఎంపీడీఓ షాలెట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.

చేజర్ల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛఆంధ్ర– స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదూరుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడులో స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఏపీఎం హరి, ఈఓపీఆర్డీ డేవిడ్, సర్పంచ్ చెరుకూరు చిన్నచెంచయ్య, పంచాయతీ కార్యదర్శులు ఆనంద్‌రెడ్డి, వీఆర్వో బికారిసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి నెల 3వ శనివారం గ్రామ పంచాయతీలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

అల్లూరు: నగర పంచాయతీ కార్యాలయం నుంచి ఆర్డీఆర్ కాలనీ వరకు కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. నగర పంచాయతీ మేనేజర్ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు సుజాత, హరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఉపసర్పంచ్ మర్తుజా, ఈఓ కరీముల్లా, ఏపీఓ శ్రీనివాసులు, వెలుగు సీసీలు పార్వతి, రత్నమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- వింజమూరులోని ప్రాథమిక సహకార సంఘ కార్యాలయ సిబ్బంది స్వచ్ఛ దివస్‌లో భాగంగా కార్యాలయ ఆవరణంలోని చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ బీ సురేంద్రరెడ్డి, సీఈఓ మేకల రమణయ్య, గని రాధిక, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఎంపీడీఓ వేణుగోపాలరావు, ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలో చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. జెడ్పీటీసీ నాగేంద్ర, ఏపీఓ అజాంఖాన్, తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురంలో..



దుత్తలూరు సెంటర్‌లో...



మర్రిపాడులో..